ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.60 (124.3222)	45,236	6,500
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.20 (3.74)	790.50	211.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	102.88 (1.03)	301	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

నిధులు పుష్కలం.. పనులు ముమ్మరం



ఏళ్ల తరబడి నిధుల కోసం నిరీక్షించిన జిల్లా ప్రాజెక్టులకు ఇక మంచి రోజులు రానున్నాయి. నిధుల్లేక ఇన్నాళ్లు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా, ప్రభుత్వం కావాల్సిన నిధులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తికి నిధుల వరద పారించింది. జిల్లాలోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులైన ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లంల, డిండి పనుల పూర్తికి డెడ్‌లైన్ సైతం విధించింది.


- (నల్లగొండ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- ఆగస్టు నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనుల పునఃప్రారంభం
- డిసెంబరు నాటికి బ్రాహ్మణవెల్లంల పూర్తి చేయాలని లక్ష్యం
- డిండి ఎత్తిపోతలకు, మినీ లిఫ్టులకు నిధుల కేటాయింపులు

ప్రాజెక్టు	కేటాయింపు (రూ.కోట్లలో)
ఎస్ఎల్‌బీసీ	రూ.799
సాగర్ లిఫ్టులు	రూ.500
డిండి ఎత్తిపోతల	రూ.300
ఎస్ఆర్ఎస్పీ రెండోదశ	రూ.34.10
మూసీ ప్రాజెక్టు	రూ.64

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రెండేళ్ల గరిష్ఠ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం గడువుగా నిర్దేశించుకుంది. జిల్లాకే చెందిన రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఇప్పటికే ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై సమీక్షలు జరిపి పనుల పూర్తికి డెడ్‌లైన్ విధించారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు వీలుగా తాజాగా గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌లోనూ అందుకనుగుణంగా నిధులను కేటాయింపజేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని, డిండి ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని భావిస్తుండగా, ఎస్ఎల్‌బీసీలో అంతర్భాగంగా ఉన్న ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుని ఈసంవత్సరం డిసెంబరు నాటికి,ఎత్తిపోతల పథకాలను గరిష్ఠంగా ఏడాదిలోగా పూర్తిచేయాలని సంకల్పించారు. ఆమేరకు త్వరలో పనులు ఊపందుకోనున్నాయి.

పనులకు పచ్చజెండా



ఈ బడ్జెట్‌లో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు రూ.799కోట్లు కేటాయించడంతో పనులు వేగవంతమవనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని భావించిన ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే మంత్రులు, ఇరిగేషన్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడంతో పనులకున్న ఆటంకాలను తొలగించేందుకు ప్రభుత్వం ముందుకురావడంతోపాటు నిధుల కొరత లేకుండా ఉండేందు కు వీలుగా గ్రీన్‌ఛానల్ అవకాశం కల్పించారు. రాబోయే రెండేళ్లలో ఈ ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న 9.5 కిలోమీటర్ల సొరంగ మార్గంతోపాటు, నక్కలగండి రిజర్వాయర్ ముంపు సమస్య పరిష్కారం, పెండ్లిపాకల రిజర్వాయర్ ఎత్తుపెంపు పనులు చేపట్టి ప్రాజెక్టుని వంద శాతం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. టన్నెల్ పనులకు ఆటంకం గా ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్‌లో ఉపయోగించే బేరింగ్ కూడా ఆగస్టు మొదటివారంలోపు యూఎస్ఏ నుంచి వస్తుందని, ఈ బేరింగ్ రాగానే పనులను పునఃప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇన్‌లెట్ టన్నెల్‌లో పనులకు అడ్డంకిగా ఉన్న ఊటనీరు, మట్టిపెళ్లలు, రాళ్లు ఊడిపడకుండా అరికట్టే పనులు సాగుతున్నాయని, ఊటనీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేథరిన్‌తో గ్రౌటింగ్ కొనసాగుతుందని, నెలాఖరుకు ఈ పనులు పూర్తయితే టన్నెల్ రెండువైపులా మళ్లీ పనులు ప్రారంభిస్తామని ఇంజనీర్లు పేర్కొంటున్నా రు. రెండువైపులా కలిపి మొత్తం 43.930 కిలోమీటర్ల టన్నెల్‌కి ఇప్పటికే 34.370 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా కేవలం 9.560 కిలోమీటర్లే తవ్వా ల్సి ఉంది. డిండి ఎత్తిపోతల పథకానికి సైతం ఈ బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు. ఈ పథకాన్ని రెండేళ్లలో పూర్తిచేయాలని సంకల్పించారు. ఈ పథకం కింద చేపట్టిన గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చర్లపల్లి, శివన్నగూడ రిజర్వాయర్లు ఇప్పటికే 80శాతం మేర పూర్తవగా, కిష్టరాయినపల్లికి భూసేకరణ పూర్తికాలేదు. భూసేకరణ పూర్తిచేయడం ద్వారా ఈ పథకం పెండింగ్ పనులు కొనసాగించాలని నిర్ణయించారు. మరోవైపు సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఆయకట్టుకు నీరందించే ఎస్ఆర్ఎస్పీ రెండోదశకు రూ.34.01కోట్లు కేటాయించారు

డిసెంబర్‌నాటికి ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల పూర్తిచేయించాలనే లక్ష్యం

ఎస్ఎల్‌బీసీలో అంతర్భాగంగా చేపట్టిన ఉదయ సముద్రం-బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్ట్‌ను డిసెంబరు నాటికి పూర్తిచేసి కాల్వలకు నీరివ్వాలని లక్ష్యంగా నిర్ధేశించారు. ఈ ప్రాజెక్టు కింద లిఫ్టు, రిజర్వాయర్ నిర్మాణాలు పూర్తవగా, కాల్వల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. యుద్ధ ప్రాతిపదికన కాల్వలకు భూసేకరణ చేపట్టి, కాల్వల నిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించింది. ఈ కాల్వలు పూర్తయి ఎత్తిపోతల పథకం అమల్లోకి వస్తే నల్లగొండ, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరందనుంది. మూసీ ప్రాజెక్టు నిర్వహణకు రూ.64కోట్లు కేటాయించడంతో ఈ ప్రాజెక్టులో మరమ్మతులకు నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎత్తిపోతల పథకాలకు రూ.500 కోట్లు

ఉమ్మడి జిల్లాలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, దేవరకొండ నియోజకవర్గాల్లో చేపట్టిన మినీ ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయించారు. ఈ పథకాలన్నింటినీ వేగవంతంగా ఏడాది గడువులోగా పూర్తిచేయించనున్నారు.

ప్రగతి పల్లెవించేనా?

- పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం
- విధి నిర్వహణలో అలసత్వం
- క్షేత్రస్థాయిలో పేరుకపోయిన సమస్యలు



మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ

పల్లెల్లో పాలన పడకేసింది. ప్రజా ప్రతి నిధుల కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కనీసం మౌలిక అవసరాల కల్పనలో అధికారులు విఫలమవుతుండటంతో సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మురుగుకాల్వల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లపైకి మురుగునీరు చేరి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వీధుల్లో బ్లీచింగ్ జల్లడం, దోమలు, కీటకాలు వ్యాప్తి చెందకుండా జనవాసాల మధ్య ఫాగింగ్ చేయకపోవడంతో పల్లెల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గత సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో పెట్టిన నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో నిధుల లేని దుస్థితి. దీంతో ఏ పనీచేయలేకుండా పోయింది. పల్లెల పరిస్థితి ఇలా ఉండగా అధికారులు అడపాదడపా వచ్చిపోతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల విషజ్వరాలతో పల్లె ప్రజలు మంచానపడ్డారు.

వివరాలు 7లో

ఒకటో తేదీలోగా బియ్యాన్ని దుకాణాలకు చేర్చాలి

- డీఎస్‌వో వెంకటేశ్వర్లు



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ టౌన్, జూలై 26: ప్రతీనెల ఒకటో తేదీలోగా రేషన్ దుకాణాలకు కేటాయించిన బియ్యాన్ని సరఫరా చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వర్‌రావుతో కలిసి పట్టణంలోని రాంనగర్ సమీపంలో గల ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీచేశారు. గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీనెల ఒకటో తేదీ నుంచి జిల్లాలోని రేషన్ డీలర్లంతా విధిగా దుకాణాలను తెరిచి వినియోగదారులకు బియ్యం సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా డీలర్లు కార్డుదారులనుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు తమ దృష్టి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమేకాకుండా లైసెన్సులను కూడా రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా కార్డు హోల్డర్లు కూడా బియ్యాన్ని విక్రయిస్తే, వారి రేషన్ కార్డును రద్దు చేస్తామన్నారు. ఆగస్టు నెలకు జిల్లాకు 6,836 మెట్రిక్ టన్నుల ధాన్యం మంజూరు కాగా కార్డుదారుల సంఖ్య ఆధారంగా కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

భూగర్భజలాలను పొదుపుగా వాడుకోవాలి

- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

నల్లగొండ టౌన్, జైలై 26: భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలని, భూగర్భజలాల సుస్థిర యాజమాన్యంలో విద్యార్థుల పాత్ర కీలకమని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ రీజినల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి అన్నారు. ఎంజీయూ జియాలజీ విభాగం, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భూగర్భజల వనరుల సుస్థిర యాజమాన్యం నలగొండ జిల్లా పరిశీలన అంశంపై జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సవాళ్లను అధిగమించేందుకు విలువైన మానవ వనరుల అవసరాన్ని గుర్తించి విశ్వవిద్యాలయ వేదికగా నిష్ణాతులను తయారు చేయడం తమ ప్రధాన ఉద్దేశమన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ ప్రధాన ఇతివృత్తంగా సాగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో 15 అంశాలను కూలంకశంగా చర్చించడంతోపాటు క్షేత్రస్థాయిలో ప్రయోగాలను సైతం విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఉపరితల జలాల వినియోగంపై దృష్టి సారించడంతోపాటు భూగర్భజలాల పెంపునకు శాస్త్రీయ పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. రూఫ్ టాప్ హార్వెస్టింగ్ పద్ధతులను అవలంబిస్తున్న బెంగళూరు మెట్రోపాలిటన్ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలుకు కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ భూగర్భజలాల అట్లాస్‌ను దక్షిణ ప్రాంత కార్యాలయం తయారు చేయడం గర్వకారణమని, యువ శాస్త్రవేత్తలకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల అంజిరెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, జియాలజీ విభాగం అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, మచ్చేందర్, సుధాకర్, వెంకటేష్, శాస్త్రవేత్తలు రాణి, యాదయ్య, రాంబాబు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సదానందం



సదానందం

నల్లగొండ, జూలై 26: జిల్లా పశుసంవర్థకశాఖ ఇన్‌చార్జి జేడీగా సదానందం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి జేడీగా ఉన్న శ్రీనివాసరావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. సదానందం వికారాబాద్‌లో పనిచేస్తూ బదిలీపై ఏడీహెచ్‌గా రాగా, ఇన్‌చార్జి జేడీగా వ్యవహరించనున్నారు. అదేవిధంగా మత్స్యశాఖ జిల్లా అధికారిగా నర్సింహారావు నియమితులయ్యారు. ఈయన మెదక్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన వెంకటయ్య వికారాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

10 రోజుల్లో బ్రాహ్మణవెల్లెంల ట్రయల్ రన్

- డిసెంబర్‌లోపు కాల్వలను పూర్తిచేస్తాం
- సొరంగమార్గానికి అమెరికా నుంచి కొత్త మిషన్లు
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ మండలం దొనకల్లులో మాట్లాడుతున్న మంత్రి

నల్లగొండ/నల్లగొండ టౌన్, జూలై 26: రానున్న 10రోజుల్లో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ట్రయల్ రన్ నిర్వహిస్తామని, అదేవిధంగా డిసెంబర్‌లోపు కాల్వలను పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని అనడానికి రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడమే నిదర్శనమన్నారు. తాను 30 సంవత్సరాలు చట్టసభల్లో ఉన్నానని, ఎప్పుడు ఇంత మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చూడలేదన్నారు. రాష్ట్రం ఏర్పాటైనప్పుడు రూ.75,577 కోట్లతో మిగులు రాష్ట్రంగా ఉండేదని, కానీ తాము అధికారంలోకి వచ్చే నాటికి రూ.6.71లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. రైతు కూలీలకు ఇచ్చే రూ.12వేలను త్వరలోనే అమలు చేస్తామని, ఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.72వేల కోట్లు కేటాయించలేదన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్దఎత్తున నిధులు కేటాయించింది తమ ప్రభుత్వమేనన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు త్వరగా పూర్తి చేసేందుకు అమెరికా నుంచి కొత్త మిషన్లు తెప్పించనున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే 4లక్షల ఎకరాలకు నీరందుతుందన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులతోపాటు, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజక్టులను పూర్తి చేస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.80కోట్లతో 20ఎకరాల విస్తీర్ణంలో బహుళ ప్రయోజనాల వసతి గృహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయం సమీపంలోని మునిసిపల్ పార్కులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఆగస్టు చివరి నాటికి ప్రభుత్వ వైద్య కళాశాల పనులు పూర్తి

నూతన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని ఆగస్టు చివరినాటికి పూర్తిచేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి తనిఖీచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆగస్టు చివరి నాటికి పనులను పూర్తి చేసి ప్రభుత్వ వైద్య కళాశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానట్లు తెలిపారు. ఉస్మానియా, గాంధీ, కాకతీయ తర్వాత ఎక్కువ మంది రోగులు వస్తున్నది నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికేనని తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొనకల్ గ్రామంలో రూ.3కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్లగొండ చుట్టుపక్కల మొత్తం బోరుబావులపై ఆధారపడిన ప్రాంతమని, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ద్వారా చెరువులను నింపితే ఈ కష్టాలు తీరుతాయన్నారు. కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులు బాగుంటేనే అందరూ బాగుంటారని, విద్య, వైద్య సేవలు పేద ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఎలక్ట్రిసిటీ డిఈ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరహాలో నల్లగొండ అభివృద్ధి

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి: నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేసుకుందామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్లగొండ పట్టణానికి రూ.140 కోట్లతో సీసీరోడ్లు, రూ.95కోట్లతో నీలగిరి నిలయంవంటి అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండ అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. బైపాస్ రోడ్డు నిర్మాణ విషయమై ఇంకా పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉన్నందున రోడ్డును వెడల్పు చేస్తే రోడ్డు వెంట ఉండే భవనాలు రోడ్డు నిర్మాణంలో పోయే అవకాశమున్నందున బైపాస్ రోడ్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఎవరికీ నష్టం కాకుండా చూస్తానన్నారు. గత 20 ఏళ్లక్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నల్లగొండలో నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నేటికి చెక్కు చెదరలేదని, కానీ ఐదేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు మాత్రం కంకర తేలాయన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ, మిర్యాలగూడ వంటి మునిసిపాలిటీల్లో వారసత్వంగా ఉన్న ఇళ్లకు ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోవడంవల్ల సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై పరిశీలనచేసి మంత్రి సహకారంతో సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తానన్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండను మంత్రి కోమటిరెడ్డి గతంలో ఎంతో అభివృద్ధి చేశారని, అయినప్పటికీ ఇంకా చేయాల్సి ఉన్నందున, తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడిన నాలుగున్నరేళ్ల కాలంలో వార్డుకు రూ.30లక్షల మించి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. జంక్షన్లు, ప్రధాన రహదారులు తప్ప శివారు ప్రాంతాల్లోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ పిల్లి రామరాజు మాట్లాడుతూ బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో ప్రజారోగ్య శాఖ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ప్రజారోగ్యశాఖ ఈఈ సత్యానారాయణ, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ పాల్గొన్నారు.

దేశసేవలో భాగమై.. అనారోగ్యంతో పోరాడి..

అసోంలో అగ్నివీర్ మృతి



విధుల్లో మహేష్(ఫైల్)

దేశానికి సేవ చేయాలన్న ఆ యువకుడి సంకల్పానికి అనారోగ్యం అడ్డు తగిలింది. రెండేళ్ల క్రితం అగ్నివీర్‌గా ఎంపికైన అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన ఈరేటి మహేష్‌యాదవ్(24) అసోం రాష్ట్రంలో గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. 2022 నుంచి అసోం రాష్ట్రంలోని దబీర్‌ఘాట్ ప్రాంతంలో భద్రతా దళాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన తీవ్ర జ్వరం, ఛాతిలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైన మహేష్‌ను అధికారులు సైనిక ఆస్పత్రికి తరలించగా అక్కడ వారం రోజులు వైద్య చికిత్సలు చేశారు. పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృత్యువాతపడ్డాడు.

7

పొలం దున్ని.. నాటేసి..

రైతుగా మారిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



నాట్లు వేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మకల్ గ్రామ శివారులో నాట్లు వేస్తున్న మహిళ కూలీలతో కలిసి నాట్లు వేసి రైతుగా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, అందులో భాగంగానే 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.72వేల కోట్లను కేటాయించిందని, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేసిందని అన్నారు. ఈ సందర్భంగా మహిళా కూలీలతో మాట్లాడారు. రైతు రుణమాఫీ పడిందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో నాట్లు వేసి ట్రాక్టర్‌తో పొలం దున్నారు.

- మాడ్గులపల్లి

'గాలి' లెక్కలుండవ్

- నాణ్యతా ప్రమాణాలు ఇక పక్కా
- ఉమ్మడి జిల్లాకు తొమ్మిది పర్యవేక్షణా కేంద్రాల మంజూరు
- గాలి కాలుష్య నియంత్రణకు ముందడుగు



భువనగిరి టౌన్, జూలై 26: ఉమ్మడి జిల్లాలో తొమ్మిది గాలి నాణ్యతా పర్యవేక్షణ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) అనుమతిచ్చింది. ఏర్పాటు వ్యయంలో 50శాతం సీపీసీబీ, మిగతా 50శాతం తెలంగాణ కాలుష్య నియంత్ర ణా మండలి భరించనున్నాయి. ఈపాటికే ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో గాలి నాణ్యతా పర్యవేక్షణా స్టేషన్ల ఏర్పాట్ల పనులు ప్రారంభమయ్యాయి. అయితే గతంలోనే మూడు పర్యవేక్షణా కేంద్రాలుండగా నూతనంగా ఏర్పాటుచేసే కేంద్రాలతో కలిపి ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యతా పర్యవేక్షణా స్టేషన్లు 12కు చేరనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో కలుషిత గాలి నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు అవకాశాలు సుగమంకానున్నాయి. కాగా వాయునాణ్యత సూచి (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్- ఏక్యూఐ) 0-50 వరకు ఉంటే స్వచ్ఛమైన, ఎలాంటి ఇబ్బందులు లేని గాలిగా పరిగణిస్తారు. కానీ సిమెంట్, రసాయన పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, రైస్ మిల్లులు తదితర కాలుష్య కారక కారణాలతో ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ సగటు 90 నుంచి 130,కొన్ని సందర్భాల్లో 180వరకు ఉంటుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

లెక్కింపు ఇలా..

గాలి నాణ్యతా పర్యవేక్షణ స్టేషన్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో వీస్తున్న గాలి నాణ్యతను లెక్కిస్తారు. ఎప్పటికప్పుడు ఆయా స్టేషన్లలో గాలి నాణ్యత నమోదవుతూ పీసీబీ సెంటర్ సర్వర్‌కు చేరుతుంది. వాతావరణంలోని ఉద్గారాలను నాణ్యతా కేంద్రం లెక్కిస్తుంది. ఎస్‌వో-2, సూక్ష్మ ధూళి కణాలు ఉండే పీఎం 10, అతి సూక్ష్మ ధూళి కణాలుండే పీఎం 2.5 లెక్కించ నున్నారు. ప్రతీ నాలుగు గంటలకు ఎస్‌వో-2, ప్రతీ ఎనిమిది గంటలకు, పీఎం 10, 2.5 ఉద్గారాల నమూనాలను పీసీబీ సేకరిస్తుంది. అలాగే ఎక్కడ ఏ రకమైన ఉద్గారాలు పరిమితికి మించి ఉన్నాయి, ఏ సమయంలో ఎక్కువ కాలుష్యం వెలువడుతున్నది తదితర వివరాలు నమోదు కానున్నాయి. నాణ్యతా స్టేషన్లలో నమోదయ్యే వివరాల ఆధారంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వాయు కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకునే వీలుంటుంది. అయితే మనం పీల్చేగాలిలో మితిమీరి ఉంటున్న ఉద్గారాలు నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుతాయి. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చర్మ, నేత్ర సమస్యలు తదితర వ్యాధులకు కారణమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పాతవి మూడు.. కొత్తగా తొమ్మిది

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండలో రెండు, చౌటుప్పల్‌లో ఒకటి మొత్తంగా మూడు గాలి నాణ్యతా పరిక్షా కేంద్రాలు ఈపాటికే ఉన్నాయి. తా జాగా మరో తొమ్మిది మంజూరయ్యాయి. వీటిలో యాదాద్రి భువనగిరి జిల్లా లో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌పై ఏర్పాటు చేయనుండగా యాదగిరిగుట్టపై ఏర్పాటు చేసేందుకు ఎన్‌వోసీ కోసం పీసీబీ అధికారులు ఆలయ ఈవో కు లేఖ రాశారు. నల్లగొండ జిల్లాలో కలెక్టరేట్‌పైన, మిర్యాలగూడ ఫైర్ స్టేషన్, పోలీస్‌స్టేసన్, అగ్రికల్చర్ సొసైటీ కార్యాలయాలపై ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో కలెక్టరేట్, టౌన్ పోలీస్ స్టేషన్‌పైన, చివ్వెంల పోలీస్‌స్టేషన్‌పై ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.



లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి

గరిడేపల్లి, జూలై 26 : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన పసులేటి బోడయ్య తన గొర్రెల మందను కీతవారిగూడెం నుంచి రాయినిపాలెం వైపు కోదాడ ప్రధాన రహదారిపై తీసుకెళ్తుండగా అప్పన్నపేట గ్రామశివారులో మిర్యాలగూడ నుంచి ఒడిషాకు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ కిందకు భయంతో ఒక్కసారిగా గొర్రెలు దూసుకెళ్లాయి. ఈ ఘటనలో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.







వైభవంగా ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, జూలై 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో అండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.9,43,076ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.




ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

నేడు యాదగిరిగుట్టలో కోర్టు ప్రారంభం

యాదగిరిగుట్ట తులసీ కాటేజీలో కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం హైకోర్టు న్యాయమూర్తులు ఈ.వీ.వేణుగోపాల్, టీ.వినోద్‌కుమార్, కే.లక్ష్మణ్, కే.సుజన ప్రారంభిస్తారని జిల్లా న్యాయాధికారి జయరాజు శుక్రవారం తెలిపారు.







స్వాతంత్ర్య సమరయోధుడు మట్టారెడ్డి మృతి

పెన్‌పహాడ్, జూలై 26: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు భైరెడ్డి మట్టారెడ్డి(105) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెం దారు. ఆయనకు భార్య అచ్చమ్మతో పాటు ఐదుగురు కుమారులు వెంకటనారాయణ, మధుసూదన్‌రెడ్డి, కేశవరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇద్దరు కుమార్తె కళమ్మ, అనంతమ్మ ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి సర్పంచ్‌గా పనిచేశారు. మరో కుమారుడు వెంకటనారాయణ గతంలోనే మృతిచెందాడు. మట్టారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడి రేవతిపరంధాములు, ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ ధనియాకుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు భైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, దంతాల వెంకటేశ్వర్లు, మామిడి శ్రీనివాస్, గజ్జెల సైదిరెడ్డి, సతీష్ నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



మట్టారెడ్డి(ఫైల్)

చోరీ చేసి.. సొంత పొలాల్లో దాచి

భువనగిరి రూరల్, జూలై 26: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, పాత ఇనుప పైపులు, కేబుల్ వైరు తదితర సామాగ్రిని అపహరించి కొందరు వ్యక్తులు తమ బావుల వద్ద దాచి ఉంచిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన నోముల శ్రీశైలం, రేగు మల్లేశ్, దయ్యాల నరేశ్ గ్రామంలోని పలువురు రైతులకు సంబంధించి బోరు మోటార్లను, కేబుల్ వైర్లు, పాత ఇనుప పైపులను గుట్టు చప్పుడు కాకుండా అపహరించుకుపోయి తమ బావి వద్ద దాచి పెట్టారు. అయితే గత ఆరు నెలల నుంచి గ్రామంలో బోరు మోటార్లు తదితర వ్యవసాయ పరికరాలు మాయమవుతున్నాయి. కాగా బాధిత రైతులు పోలీసులకు గతంలో ఎన్నో సార్లు ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు చేశారు. అయితే నోముల శ్రీశైలం వ్యవసాయ బావి వద్ద బోరు మోటార్లు, ఇనుప పైపులు తదితర దొంగిలించిన సామాగ్రిని గుర్తించి ఓ రైతు ఈ విషయమై గ్రామస్థులకు చెప్పడంతో వారంతా రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ ఎస్‌ఐ వి సంతోష్‌కుమార్ గ్రామంలో పరికరాలు దాచి ఉన్నప్రదేశానికి వెళ్లి అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న నోముల శ్రీశైలం, రేగు మల్లేశ్, దయ్యాల నరేశ్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. గతంలో వీరిపై పలు దొంగతనాలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.



చోరీ చేసిన బోరు మోటార్లు

గేయవర్షిణికి కళారత్న అవార్డు


మిర్యాలగూడ టౌన్, జూలై 26: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యార్థిని గుంటూరు గేయవర్షిణి ప్రతిష్ఠాత్మక జాతీయ కళారత్న అవార్డుకు ఎంపికైంది. 30వేల బియ్యపు గింజలపై లక్ష్మీనరసింహ నామాన్ని రాసి భక్తి పారవశ్యాన్ని చాటిన గేయవర్షిణిని కళారత్న అవార్డుకు బహుజన సాహిత్య అకాడమీ ఎంపిక చేసింది. ప్రతీ ఏటా ఆధ్యాత్మిక విభాగాల్లో అవార్డులు అందజేసే బీఎస్‌ఏ మైక్రో లెటర్స్ రైటింగ్ విభాగంలో గేయవర్షిణికి జాతీయ కళారత్న అవార్డు అందించనుంది. సెప్టెంబరు 5న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి క్షేత్రంలో నిర్వహించే ఆధ్యాత్మికోత్సవంలో అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గేయవర్షిణి తల్లిదండ్రులు గుంటూరు శ్రీనివాస్, శ్రీలక్ష్మిలను అభినందించారు.



బియ్యపు గింజపై నామాలు రాస్తున్న గేయవర్షిణి

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కోదాడ రూరల్, జూలై 26: గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా ఆటోను సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దున ఉన్న నల్లబండగూడెం, రెడ్లకుంట, కూచిపూడి, దోరకుంటతో పాటు పలు గ్రామాలకు ఆంధ్రా ప్రాంతానికి చెందిన గుట్కా వ్యాపారి నందుల రాజా తన ఆటో ద్వారా గుట్కా ప్యాకెట్లు సరఫరా చేస్తున్నాడు. శుక్రవారం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గల పాన్‌షాప్‌లో విక్రయిస్తుండగా దాడి చేసి ఆటోలో ఉన్న రూ.8 వేలు విలువైన గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యాపారి నందుల రాజాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన జంగిలి వెంకటేశ్వర్లు కూడా తన ఆటోలో గుట్కా ప్యాకెట్లు తీసుకుని నల్లబండగూడెం గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి ఆటోతో పాటు రూ.2 వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జంగిలి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆంధ్రా ప్రాంతంలో గుట్కా, అంబర్ ప్యాకెట్లపై నిషేధం లేకపోవడంతో అక్కడి వ్యాపారులు తెలంగాణలో కూడా ఆటోల ద్వారా పాన్‌షాప్‌లకు పెద్దఎత్తున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గుట్కా, పొగాకు ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపడంతో పోలీసులు దాడులు నిర్వహించి రూ.10 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.



ప్రగతి పల్లెవించేనా?

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఈ ఏడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా, ఈ నెల 2వ తేదీతో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. దీంతో క్షేత్రస్థాయిలో పల్లెల్లో పాలన అధికారుల చేతుల్లోకి వెళ్లింది. అయితే వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్న చిన్న పనులు కూడా నిధుల్లేక పూర్తిచేయలేకపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వెరసి పల్లెలు సమస్యలతో తల్లడిల్లుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)/దేవరకొండ,ఆలేరురూరల్,భువనగిరిరూరల్, చౌటుప్పల్

- మొదలైన ప్రత్యేక అధికారుల పాలన
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించని అధికారులు
- నామమాత్రంగా బాధ్యతల నిర్వహణ
- నిధులు లేక నిలుస్తున్న పనులు
- పారిశుధ్యం నిర్వహణ, మౌలిక వసతుల ఏర్పాట్లపై తీవ్ర ప్రభావం
- పలు పనుల కోసం సొంత డబ్బులు వెచ్చిస్తున్న కార్యదర్శులు



మోటకొండూరులో చిత్తడిగా మారిన సెయింట్ పీటర్ స్కూల్ మార్గం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామాల్లో సమస్యలు తిష్ఠవేశాయి. పలు గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ఒక రోజు మిషన్ భగీరథ నీటిని అందిస్తే నాలుగు రోజుల దాకా రావడం లేదు. అయినా పట్టించుకునే వారేలేరు.పల్లెలతో పాటు మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పారిశుధ్య లోపం ఉంది. డ్రైనేజీ కాల్వల్లో పూడికతీత,ఇతర పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కరువైంది. పూడిక నిండిన మురుగు కాల్వలు, మురుగు కుంటలు, చెత్త కుండీలు, డంపింగ్ యార్డులు లేక ఎక్కడ పడితే అక్కడ పేరుకపోయిన చెత్తాచెదారంతో దోమల వ్యాప్తి పెరిగింది.

సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామపంచాయతీల్లో స్పెషల్‌అధికారుల పాలన కొనసాగుతోంది. పలు పంచాయతీలకు ఇన్‌చార్జీ కా ర్యదర్శులు ఉన్నారు. కొత్తగా ఏర్పాటైన గ్రామపంచాయతీల్లో 60 దాకా ఎస్టీ జనాభాతో కూడినవే ఉన్నాయి. పారిశుధ్యం లోపించి ఇటీవల హుజూర్‌నగ ర్, పెన్‌పహాడ్, మఠంపల్లి మండలాల్లో విషజ్వరాలు ప్రబలాయి. అంతర్గ త రహదారులు గుంతలమయమై కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నాయి. వీధిదీపాలు ఉన్నా నిర్వహణ సరిగా లేక పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.

నిధుల కొరతతో అరకొరగా సమస్యల పరిష్కారం

పంచాయతీలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పంచాయతీల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సమస్యలను అరకొరగా పరిష్కారం అవుతున్నాయి. కొన్నిచోట్ల గ్రామకార్యదర్శులు అప్పులుచేసి పనులు చేపడుతున్నారు. దేవరకొండ నియోజకవర్గంలో 215 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో సమస్యలను అధికారులు పరిశీలించడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీలకు చెందిన ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చు నెలకు రూ.7 నుంచి రూ.8 వేల వరకు వస్తుంది. దీంతో పాటు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు కూడా నిధులు లేకపోవడంతో తామే సర్దుబాటు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు, కేంద్రం నిధులు పంచాయతీలకు కేటాయించలేదు. దీంతో గ్రామాల్లో కాలువల మరమ్మతులు, నూతన కాల్వల నిర్మాణం, రోడ్లు, మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకొని కంపచెట్లు తొలగించడం, చిన్న, చిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. నిధులులేకపోవడంతో అభివృద్ధి పనులను చేపట్టడంలేదు.

- చింతపల్లి మండలకేంద్రంలోని బీసీ కాలనీలో 10 రోజుల కిందట మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. కాలనీవాసులు గ్రామకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా నిధుల్లేక మరమ్మతులు చేయడానికి ఐదు రోజులు పట్టింది. విధిలేని పరిస్థితిలో కాలనీవాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తెచ్చుకున్నారు.
- దేవరకొండ మండలం కొండభీమనపల్లి ఎస్సీ కాలనీలో పారిశుధ్యం లోపించిందని, కాల్వలు ధ్వంసమయ్యాయని, నీటి ట్యాంక్ లీకై నీరు వృథాగా పోతుందని ప్రజావాణిలో కాలనీవాసులు ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారు. అయితే నిధుల లేమితో సమస్యలు పరిష్కారం కాలేదు.



కొండభీమనపల్లిలో శిథిలావస్థలో కాల్వ, ఏపుగా పెరిగిన కంపచెట్లు

చుట్టపు చూపుగా గ్రామాల్లో పర్యటన

ఆలేరు నియోజకవర్గంలో ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు, గుండాల, యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం కలిపి ఎనిమిది మండలాలు ఉన్నాయి. మొత్తం 186 గ్రామపంచాయతీలు ఉండగా 50 కిపైగా తండాలు, ఆవాస గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గంలో పెద్ద గ్రామపంచాయతీలకు ఒకరు చొప్పున రెండు మూడు చిన్న గ్రామాలకు ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులు తమవిధులను నిర్వర్తించలేక గ్రామాలను సందర్శించలేక చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిధుల్లేక పోవడంతో పనులు పడకేశాయి. పలు గ్రామపంచాయతీల్లో కొన్ని నెలలుగా సిబ్బందికి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా పంచాయతీ కార్యదర్శులే ఆర్థిక వనరులను సమకూరుస్తూ నెట్టుకువస్తున్నారు. దీంతో వారిపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సర్పంచ్‌లు స్థానికంగా ఉండేవారని తమ సమస్యలు చెప్పుకొని పరిష్కరించుకునే వారమని ప్రత్యేక అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో, సమయానికి రాకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అంటున్నారు.

భువనగిరి నియోజకవర్గంలో ఐదు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు పలు సమస్యలతో సతమతమవుతున్నాయి. భువనగిరి నియోజకవర్గంలో 126 పంచాయతీలున్నాయి. ప్రతీ పంచాయతీకి ఒక మండల స్థాయి అధికారిని నియమించారు. అయితే సర్పంచ్‌లు ఉన్న సమయంలో గ్రామసమస్యలను గుర్తించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధులను మంజూరు చేయించుకుని గ్రామాభివృద్ధికి కృషి చేసేవారు. ప్రత్యేకాధికారులు వారానికి రెండుసార్లు గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకుని పైఅధికారులకు నివేదికలు అందజేస్తున్నా నిధుల లేమితో, చుట్టపు చూపుగా వచ్చిపోతూ నామమాత్రంగా ఉండడం.. అనంతరం తమ శాఖ పరమైన విధుల్లో నిమగ్నం అవుతుండటంతో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది.

చౌటుప్పల్ మండలంలో ప్రత్యేక అధికారుల పాలనలో కొన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతుండగా, మరికొన్ని సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ పెట్టకపోవడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రోజులుగా వరుసగా ముసురుతోవర్షం పడుతుండడంతో మురుగు కాల్వల పూడికతీతను పట్టించుకునే వారు కరువయ్యారు. కొన్ని గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లు ఆటోలు వారానికోసారి తిరుగుతున్నాయి. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకు న్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామాలలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. కొన్ని గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు బదిలీలపై వెళ్లడంతో ఆయా గ్రామాల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



చింతపల్లి బీసీ కాలనీలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సమస్యలను పరిష్కరిస్తున్నాం



గ్రామాల్లోని ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే ఉన్నాం. పంచాయతీ కార్యదర్శులు ప్రజాసమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నారు.

- రాంమోహన్‌రావు, దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి.

సంపు లీకేజీలను అరికట్టాలి



కొండభీమనపల్లిలోని బీసీకాలనీ నుంచి మురుగునీరు వాటర్ సంపు వద్దకు చేరుకొని నిల్వ ఉంటోంది. నీరు నిల్వ ఉండకుండా కాల్వలను పునరుద్ధరించాలి. వాటర్ సంపు లీకేజీని అరికట్టాలి. కంపచెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలి.

- ఎర్ర ఆంజనేయులు, కొండభీమనపల్లి, దేవరకొండ మండలం.

డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేశాం

చింతపల్లి మండలకేంద్రంలోని బీసీ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయి కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికమైంది. ప్రజావాణిలో ఫిర్యాదులు చేశాం. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే నిధులు మంజూరైన తరువాత సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

- రమేష్‌యాదవ్,చింతపల్లి.



భువనగిరి మండలం రామకిష్టాపురంలో రోడ్డు పక్కన మురుగు నీరు

ముసురుకుంటున్న వ్యాధులు



మాడ్గులపల్లి మండలం కన్నెకల్‌లో ఆరోగ్య విషయాలు వివరిస్తున్న నల్లగొండ జిల్లా మలేరియా అధికారి

మిర్యాలగూడ : పల్లెల్లో మురుగు కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. మాడ్గులపల్లి మండలం కన్నెకల్‌లో నెల రోజులగా విషజ్వరాలు ప్రబలి ఊరంతా మంచం పట్టడంతో వైద్యాధికారులు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి, మురుగుకాల్వలపై, మురుగుగుంతలపై బ్లీచింగ్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాల్సి వచ్చింది. వేములపల్లి మండలంలో పారిశుధ్య పనులు కొనసాగడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల వెంట పెరిగిన కంపచెట్ల తొలగింపు చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. అడవిదేవులపల్లి మండలంలో ముదిమాణిక్యంలో బోర్లు పనిచేయక తాగు నీటి ఎద్దడితో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

60 మంది ప్రత్యేక అధికారులు

మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 136 పంచాయతీలు ఉన్నాయి. సుమారు 60మంది ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పంచాయతీ కార్యదర్శులపై ఆధారపడి గ్రామపాలనను కొనసాగిస్తున్నారు. పంచాయతీల్లో గత సర్పంచ్‌ల కాలంలో మిగులు నిధులుంటే స్పెషలాఫీసర్ అనుమతితితో కార్యదర్శులు అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగులు లేని చోట్ల కార్యదర్శుల జీతాల నుంచి డబ్బులు వెచ్చించి పనులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. రైతుల బోర్లు అద్దెకు తీసుకున్న చోట ప్రభుత్వం రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న జీపీ వర్కర్ల వేతనాలు జూలై మొదటి వారంలో విడుదల చేశారు. వీధి లైట్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా పైపుల లీకేజీ మరమ్మతుల పనులు, బోరు మోటార్ల రిపేర్లు, ప్రజారోగ్యానికి సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో పనులు కాక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

బదిలీలతో ఖాళీలు



చిననెమిల గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

మోత్కూరు: పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న తరుణంలోనే ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు బదిలీపై వెళ్లడంతో కొన్ని గ్రామాలకు ప్రత్యేక అధికారులే లేకుండాపోయారు. పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సెలవుపై వెళ్లడం, బదిలీ కావడం తదితర కారణాలతో ఇన్‌చార్జి కారదర్శులతో వెళ్లదీస్తున్నారు. దీంతో పాలన అస్తవ్యస్తంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో 154 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మోత్కూరులో 10 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 3 చోట్ల రెగ్యూలర్ కార్యదర్శులు లేరు. దాచారం ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పదవీవిరమణ చేశారు. మరో రెండు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ బదిలీ వెళ్లడంతో మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారులు లేరు. దాచారం ఇన్‌చార్జి కార్యదర్శి రాక, ప్రత్యేక అధికారి లేక గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. సంతకాలు చేసి నిధులు డ్రా చేసే అధికారులు లేక సిబ్బందికి ఆరు మాసాలుగా వేతనాలు అందక వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. శాలిగౌరారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు గ్రామాల కార్యదర్శులు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కార్యదర్శులతో నడుస్తున్నాయి. మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న అధికారులకు బదిలీ కావడంతో ఆ గ్రామాలకు ప్రత్యేక అధికారులు లేకుండాపోయారు. అడ్డగూడూరు మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా మూడు గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు ఉన్నారు. తుంగతుర్తి మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా రెండు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు లేక ఇన్‌చార్జిల పాలనలో ఉన్నాయి. మద్దిరాల మండలంలో ఒక పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శి ఉన్నారు. ఇలా అన్ని మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

1.50అడుగులు పెరిగిన సాగర్ నీటిమట్టం

- 505.60 అడుగులకు చేరుకున్న సాగర్ జలాశయం
- ఎగువనుంచి 45,236 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్/కేతేపల్లి/మేళ్లచెర్వు, జూలై 26: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 505.60 అడుగులకు(124.3222 టీఎంసీలు) చేరుకుంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 504.10 అడుగులుగా (121.8709 టీఎంసీలు) ఉన్న సాగర్ నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 1.50 అడుగుల మేర పెరిగి 505.60 అడుగులకు చేరింది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 9,921 క్యూసెక్కులు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు మొత్తంగా శ్రీశైలం నుంచి 45,236 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి చేరుతోంది. దీంతో సాగర్ నీటి మట్టం ఒక్క రోజులో 1.50అడుగులు పెరిగింది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 45,236 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

642అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుండడంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.



వరద నీటితో నిండుకుండలా ఉన్న నల్లగొండ జిల్లా కేతేపల్లి పరిధిలోని మూసీ జలాశయం

645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 642.20అడుగులుగా (3.74టీఎంసీ) నమోదైంది. ఎగువనుంచి ప్రాజెక్టులోకి 790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు నిమిత్తం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 211 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల'కు 301క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 102.88 అడుగులుగా(1.03టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 301 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు నీటి విడుదల లేదు.

దేశసేవలో భాగమై.. అనారోగ్యంతో పోరాడి..

- అసోంలో ఆర్మీ అగ్నివీర్ మృతి
- స్వగ్రామం నల్లగొండ జిల్లాలో విషాదఛాయలు
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు



మహేష్ ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మహేష్(ఫైల్‌ఫొటో), అసోంలో శవపేటిక వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు

హాలియా, జూలై 26: దేశ సేవ చేయాలనే సంకల్పం.. సోదరుడి స్ఫూర్తితో అగ్నివీర్‌గా ఎంపికై అసోంలో విధులు నిర్వర్తిస్తున్న ఆ యువకుడు అనారోగ్యంతో కన్నుమూశాడు. నల్లగొండ జిల్లా అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన ఆర్మీ అగ్నివీర్ ఈరేటి మహేష్‌యాదవ్(24) అసోం రాష్ట్రంలో గురువారం రాత్రి మృతి చెందారు. 2022లో ఆర్మీ అగ్నిపథ్‌కు ఎంపికై అసోం రాష్ట్రంలోని దబీర్‌ఘాట్ ప్రాంతంలో భద్రత దళాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన తీవ్ర జ్వరం, ఛాతిలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైన మహేష్‌ను అధికారులు సైనిక ఆస్పత్రికి తరలించగా అక్కడ వారం రోజులు వైద్యచికిత్సలు చేశారు. పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా 17రోజులపాటు అనారోగ్యంతో పోరాడి గురువారం రాత్రి మృతి చెందాడు.

సోదరుడి స్ఫూర్తితో అగ్నివీర్‌గా ఎంపికై...

వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న ఈరేటి యాదయ్య, పార్వతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా మొదటి కుమారుడు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు నరేష్ ఆర్మీలో ఉండగా, మహేష్ మూడో కుమారుడు. నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన మహేష్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ పొందాడు. క్రీడలపై మక్కువతో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) పూర్తిచేశాడు. మహేష్‌యాదవ్ అన్న ఈరేటి నరేష్ 2019లో రక్షణరంగం(ఆర్మీ)లో చేరి జమ్ముకశ్మీర్‌లోని మహార్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకుని దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో మహేష్ 2022 సంవత్సరంలో అగ్నిపథ్‌లో భాగంగా అగ్నివీర్‌గా ఎంపికై అసోంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

15 రోజుల కిందట తల్లితో మాట్లాడి..

ఆరు నెలల క్రితం స్వగ్రామం మదారిగూడెం వచ్చి వెళ్లిన మహేష్‌యాదవ్ 15రోజుల క్రితం తల్లితో ఫోన్‌లో మాట్లాడాడు. కశ్మీర్‌లో ఉంటున్న సోదరుడి భార్య ప్రసవం కోసం మదారిగూడెం రావటంతో ఆ సమయంలో కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. సోదరుడు నరేష్ ప్రస్తుతం కశ్మీర్‌లో విధుల్లో ఉన్నారు.

నేడు మృతదేహం రాక

ఆర్మీ అగ్నివీర్ మహేష్ మృతదేహాన్ని అసోం రాష్ట్రం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆర్మీ అధికారులు శుక్రవారం రాత్రి సికింద్రాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి తీసుకురానున్నారు. అక్కడ వారి లాంఛనాలు పూర్తి చేసి శనివారం ఉదయం స్వగ్రామం మదారిగూడెం గ్రామానికి తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. దేశానికి సేవ చేస్తానంటే ప్రోత్సహించి పంపిస్తే విగతజీవిగా తిరిగి వస్తున్నాడంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. శనివారం గ్రామంలో మహేష్‌యాదవ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం 7 గంటలకు హాలియా సెంటర్ నుంచి మదారిగూడెం వరకు మృతదేహాన్ని తీసుకెళ్లనున్నారు. ఇంటి వద్ద అధికారులు, ప్రముఖులు నివాళులర్పించనున్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తులకు జైలు

చింతపల్లి, జూలై 26: హత్యాయత్నం కేసులో ముగ్గురికి పదేళ్ల జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిసనగండ్ల యాదయ్య, జగన్, ఎరుకల రమేష్ కలిసి పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన కాటేపాక చంద్రయ్యపై 2014 ఆగస్టు 23న కర్రల, రాళ్లతో హత్యాయత్నం చేశారు. చంద్రయ్య కుమారుడు ఇంద్రకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ధనుంజయ్య కేసు నమోదుచేశారు. దేవరకొండ డీఎస్పీలు మనోహర్, చంద్రమోహన్ పూర్తి ఆధారాలతో ఛార్జిషీట్‌ను నల్లగొండ కోర్టులో దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ముగ్గురికి ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి ఎన్.రోజారమణి పదేళ్ల జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ డీఎస్పీ గిరిబాబు, సీఐ నవీన్, ఎస్‌ఐ యాదయ్యలను అభినందించారు.

ప్రాణాలు నిలిపిన పోలీసులు



దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి నందును తీసుకువచ్చిన పోలీసులు

కొండమల్లేపల్లి, జూలై 26 : ఆత్మహత్యాయత్నం చేసి అపస్మారకస్థితిలో ఉన్న మహిళను నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పోలీసులు తమ వాహనంలో తరలించి ప్రాణాలు నిలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం అంగోతు తండాకు చెందిన అంగోతు నందు(26) భర్త శ్రీనునాయక్‌తో గొడవ పడి క్షణికావేశంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుంది. తక్షణమే స్పందించిన భర్త వేలాడుతున్న భార్యను చూసి కిందికి దించి వెంటనే గ్రామం నుంచి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తన బైక్‌పై తీసుకొస్తుండగా మార్గమధ్యలో కొత్తబాయి గేటు సమీపంలో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. నందు పరిస్థితిని గమనించిన పోలీసులు తమ వాహనంలో ఆమెను చికిత్స దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నందు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. సమయానికి స్పందించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ మజీద్, రాములకు నందు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ బాటిల్‌తో రైతు నిరసన



రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలుపుతున్న రైతు అంజయ్య

రామన్నపేట, జూలై 26: తన భూమిలోని కడీలు ధ్వంసం చేశారని ఓ రైతు పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన బోయిని అంజయ్యకు 3.30ఎకరాల భూమి ఉంది. అంజయ్య దివ్యాంగుడు కాగా కుటుంబసభ్యుల సహకారంతో వ్యవసాయం చేస్తున్నాడు. ఇదే భూమిని సరిహద్దు రైతులు ఆక్రమిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అంజయ్య ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేయగా, ఆ హద్దురాళ్ల ప్రకారం తన పొలం చుట్టూ కడీలను పాతించాడు. తన భూమిలోని కడీలను సమీప భూముల్లోని రైతులు విరగ్గొట్టి ఇబ్బందులు పెడుతున్నారని అంజయ్య ఆరోపించాడు. దివ్యాంగుడినైన తన భూమిని ఇతరులు ఆక్రమించాలని చూస్తున్నారని, ఈ విషయంపై తహసీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రం ఇచ్చానని తెలిపాడు. స్పందించకపోవడంతో శుక్రవారం పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందని తెలిపాడు. అంజయ్య కుటుంబ సభ్యుల ఆందోళనకు స్థానిక రైతులు, గ్రామస్థులు అండగా నిలిచారు. ఎస్‌ఐ పి.మల్లయ్య తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అంజయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రైతు భూమిలో కడీలు విరగ్గొట్టి వారిపై వెంటనే కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చి, రైతుకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్ లాల్ బహద్దూర్ మాట్లాడుతూ సోమవారం లోగా రైతు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మోటార్‌పైప్ తీసేందుకు వెళ్లి మృత్యువాత

కోదాడ రూరల్, జూలై 26: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండలో బావిలో పడిపోయిన పైప్ తీసేందుకు వెళ్లి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిబండ గ్రామానికి చెందిన కే.నాగరాజు(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు దేవరపల్లి రమణారెడ్డి తన పొలంలోని బావిలో పడిన మోటార్‌కు సంబంధించిన పైప్‌ను బయటికి తీసేందుకు నాగరాజును తీసుకెళ్లాడు. దీంతో బావిలో దిగిన నాగరాజు నీటిలో మునిగి ఎంతకూ బయటికి రాకపోవడంతో రమణారెడ్డి ఆందోళన చెంది చుట్టుపక్క రైతులు, పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే రైతులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని మోటార్ ద్వారా బావిలో ఉన్న నీటిని బయటికి తీశారు. అప్పటికే నాగరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా, నాగరాజు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కొంతమంది అడ్డుకున్నారు. నాగరాజు కుటుంబానికి ఆర్థిక అందించాలని పట్టుబడ్డారు. మృతదేహంతో బావి వద్దే ఆందోళనకు దిగారు. రూ.5 లక్షలు ఇచ్చేందుకు రమణారెడ్డి అంగీకరించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత

కోదాడ రూరల్, జూలై 26 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్న వెంకట్రామిరెడ్డి ఇంటిపై గురువారం రాత్రి పోలీసు బృందంతో దాడి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇంట్లో ఉన్న 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. వెంకట్రామిరెడ్డి గ్రామంలో రేషన్ కార్డుదారుల వద్ద నుంచి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని తెలిపారు. గురువారం రాత్రి కూడా వెంకట్రామిరెడ్డి బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ప్రతి నెల సుమారు 30 నుంచి 40 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు.

మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలో

మిర్యాలగూడ రూరల్, జూలై 26 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకట్రాదిపాలెంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో వెంకటాద్రిపాలెం గ్రామశివారులోని దిలావర్‌పూర్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న సుమారు ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ ధనావత్ నాగును విచారించగా మండలంలోని ఏడుకోట్లతండా వైపు ఉన్న గ్రామాల్లో రేషన్‌కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నట్లు అంగీకరించాడని తెలిపారు. ఆటోను, బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి నాగుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం


నిరసన తెలుపుతున్న బీజేపీ యువమోర్చా నాయకులు

రామగిరి జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ బడ్జెట్ తీరుపై నిరసన తెలిపేందుకు గురువారం పార్టీ కార్యాలయం నుంచి సుభాష్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పెరిక మణికుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియచేస్తే కూడా ప్రభుత్వం అడ్డుకుంటూ, హక్కులు అణచివేస్తూ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా దళితుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి కార్పొరేషన్‌కు రూ.750 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ, నాయకులు చింత శివరామకృష్ణ, బోగిరి అనిల్‌కుమార్, యనమల మహేష్, పల్లె ప్రకాష్, గాలి శ్రీనివాస్, దాసరి సాయి, దాసరి కృష్ణ, కిరణ్‌కుమార్, ఈశ్వర్, సుధాకర్, మహేష్, శంకర్, తార, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

చిట్యాల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, కార్యదర్శి మాస శ్రీనివాస్ విమర్శించారు. చిట్యాలలో శుక్రవారం బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో దళితులకు జనాభా ప్రకారం నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు శేఖర్, నాయకులు కోరబోయిన లింగస్వామి, కూరెల్ల శ్రీను, పోలిమెర నర్సింహ, జిట్ట విష్ణు, పాల రవివర్మ, మహలింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి


సభ్యత్వాలు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నిడమనూరు, జూలై 26: పీఆర్సీ 50 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు సుంకరి భిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రబెల్లి, ముప్పారం, ఊట్కూరు, సోమారిగూడెం, మారుపాక, వేంపాడ్ పాఠశాలల్లో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, పాఠశాలల్లో తక్షణమే స్కావెంజర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పాంపాటి శ్రీనివాసులు, మేకల జాన్‌రెడ్డి, మంత్రాల సురేందర్‌రెడ్డి, సైదులురావు గౌతమ్, వెంకట్‌రెడ్డి, కిరణ్, కోటయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న సౌజన్య స్కూల్ గేమ్ ఫెడరేషన్ దేవరకొండ డివిజన్ సెక్రటరీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలల్లో ఆమెను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. కార్యక్రమంలో వాసుదేవ్‌రెడ్డి, డి.శ్రీనివాస్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి, జూలై 26: ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా అర్హులైన రైతులంతా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ నకిరేకల్ ఏడీఏ రామారావునాయక్ కోరారు. కేతేపల్లి మండలంలోని భీమారం, కేతేపల్లి, ఇప్పలగూడెం రైతువేదికల్లో శుక్రవారం నిర్వహించిన రైతుబీమా దరఖాస్తుల స్వీకరణను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. రైతు రుణమాఫీపై ఏపీజీవీబీలో బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇటీవల కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు, నామినీ పేరు మార్చుకోవాలనుకునే వారు తమ దరఖాస్తులను రైతుల వేదికల్లో ఏఈవోలకు అందించాలన్నారు. ఎరువుల వ్యాపారులు విధిగా ఈ పోస్ ద్వారానే విక్రయించాలని ఆదేశించారు. రైతు రుణమాఫీ మంజూరైన రైతులందరికీ బ్యాంకు అధికారులు సకాలంలో కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని సూచించారు. ఏడీఏ వెంట కేతేపల్లి ఏవో బొక్క పురుషోత్తం, ఏఈవోలు ఉమేష్, వీరేష్, బాలరాజు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండరూరల్, జూలై 26: భవన నిర్మాణరంగంలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం డీసీఎల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా భవన నిర్మాణరంగంలో పని చేస్తున్నారని, వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేస్తున్నారని అన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు లెనిన్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

నల్లగొండరూరల్, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన, ఉద్యోగులకు రెండో పీఆర్సీపై ప్రకటన చేయకపోవడం విచారకరమని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం కనీస వేతనాల అమలు కోసం కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ, విజయలక్ష్మి, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

వేములపల్లి, జూలై 26: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రుణమాఫీకి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. త్వరలోనే రైతుభరోసా కూడా అందించేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో నాయకులు మాలి కాంతారెడ్డి, ఎల్లారెడ్డి, సత్తిరెడ్డి, కృపయ్య, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

దేశ రక్షణలో సైనికుల సేవలు అజరామరం

● సైనిక సంక్షేమ శాఖ అధికారి మక్బూల్ అహ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న మక్బూల్ అహ్మద్

నల్లగొండ టౌన్, జూలై 26: దేశ రక్షణ, ప్రజల రక్షణ కోసం వీరమరణం పొందిన సైనికుల సేవలు అజరామరమని సైనిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి మక్బూల్ అహ్మద్ అన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కార్యాలయంలో కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర సైనికులకు నివాళులర్పించి మాట్లాడారు. వీర సైనికుల త్యాగాన్ని గుర్తు చేసుకుని సైనికులను స్ఫూర్తిగా తీసుకుని కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులను సన్మానించారు. అనంతరం మెమెంటోలు అందజేశారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంది పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లోజు వెంకటాచారి, నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రయ్య, షకీల్, లింగాచారి, రాములు, మారయ్య, కార్యాలయ సిబ్బంది అంజాద్‌షరీఫ్, నర్సింహస్వామి, హసీం, శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: సైనికులు దేశ రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండారని, దేశ రక్షణ కోసం వారు చేస్తున్న కృషి అభినందనీయమని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి జక్కుల శ్రీనయ్యను సన్మానించి మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, వర్షానికి తడుస్తూ దేశ ప్రజల కోసం పోరాడుతూ విధులు నిర్వహిస్తున్న భారత సైనికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఎస్‌బీఐ దేవరకొండ చీఫ్ మేనేజర్ ఫణిందర్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణకిషోర్, భాస్కర్‌రెడ్డి, ఉమ మహేశ్వర్, వెంకటేష్, గోపాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి : బీఎల్ఆర్


ప్లాస్టిక్ దుకాణ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూలై 26: ప్లాస్టిక్ నియంత్రణకు అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పాతమార్కెట్‌లో శుక్రవారం ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు, వ్యాపారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను - నా మిర్యాలగూడ' నినాదంతో ఆగస్టు 15వ తేదీ వరకు పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిషేధించిన ప్లాస్టిక్‌ను విక్రయించవద్దని, ప్రజలు వినియోగించరాదన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ ఉన్నారు.

● కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలకోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలకు లక్ష రూపాయలు కేటాయించారని, ఆ నిధులను కలెక్టర్ పర్యవేక్షణలో ఖర్చు చేసి నియోజకవర్గంలోని ప్రతీ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా బాలకల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నల్లగొండటౌన్, జూలై 26: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు నామిరెడ్డి నర్సింహారెడ్డి, బకృతోళ్ల మాకయ్య, ప్రధానకార్యదర్శి సయ్యద్ తాజుద్దీన్, కార్యదర్శులు కొండా పురుషోత్తం, డాక్టర్ తోట నరసింహాచారి, సహాయ కార్యదర్శులు పగిడి మర్రి నరేష్, ఒంటెద్దు నారాయణమ్మ, కోశాధికారి ఏరుకొండ శంకరయ్య, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షుడు మేడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని అన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు పర్యటించి జిల్లా కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎవీఎల్ నర్సిహారావు, ఐతగాని శేఖర్, జిల్లపల్లి ఇంద్ర, వంగూరి వెంకటేష్, ముజీఫ్, బత్తుల నగేష్, ఏరుకొండ వెంకన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటరుణాల కోసం 'మాఫీ' రైతుల పరుగులు

● వడ్డీ చెల్లిస్తేనే కొత్త పంట రుణాలిస్తామంటూ బ్యాంకర్ల మెలిక


నిడమనూరులో బ్యాంకులో బారులు తీరిన రైతులు

నిడమనూరు, జూలై 26: రుణమాఫీ పొందిన రైతులు తిరిగి పంట రుణాలు పొందేందుకు బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. వారం రోజులుగా బ్యాంకుల వద్ద రైతుల సందడి కనిపిస్తుంది. రూ.లక్ష లోపు పంట రుణాలను ప్రభుత్వం ఈ నెల 18న మాఫీ చేసింది. ఈనెలాఖరు వరకు రూ.లక్షన్నర, రూ.రెండు లక్షలు ఉన్న రుణాలను వచ్చే నెల 15వ తేదీ వరకు మాఫీ చేయనుంది. 2023 డిసెంబరు 9 వరకు ఉన్న రూ.లక్ష లోపు రుణాలను వడ్డీతో సహా మాఫీ చేయడంతో నిడమనూరు మండలంలో సుమారు రూ.15.10కోట్ల వరకు గాను 3132 మంది రైతులు లబ్ధిపొందారు. ఆధార్ కార్డులో పేరు తప్పులుగా ఉండటం, బ్యాంకు ఖాతా నెంబరు ఆధార్‌కు లింకు లేకపోవడం వంటి వివిధ కారణాలతో అనేక మంది రైతులకు మాఫీ రాలేదు. రుణమాఫీతో లబ్ధి పొందని రైతులు వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మాఫీ పొందిన రైతులు మాత్రం కొత్త రుణాలు పొందేందుకు బ్యాంకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. గతేడాది తొమ్మిదో తేదీ వరకు అసలు సహా వడ్డీని కూడా ప్రభుత్వం చెల్లించింది. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు కట్టాల్సిన వడ్డీని రైతులు ముందుగా చెల్లిస్తేనే తిరిగి కొత్త రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకర్లు తేల్చిచెబుతున్నారు. దీంతో రైతులు ముందుగా వడ్డీ చెల్లించేందుకు తిప్పలు పడుతున్నారు. వడ్డీ చెల్లించడంతో పాటు రైతులు బ్యాంకుల్లో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, 1బీ ఫారం, ఖాతాదారుడి ఫొటోలు బ్యాంకుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. రైతులకు సంబంధించిన 1బీ ఫారం సక్రమంగా ఉంటేనే రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇస్తున్నారు. దీంతో వారం రోజులుగా మండల కేంద్రంలోని అన్ని బ్యాంకులు, సింగిల్‌విండో సొసైటీలు రైతులతో సందడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు బ్యాంకుల ముందు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీవీబీల ముందు రైతుల రద్దీ ఎక్కువగా ఉంది. జీరాక్స్ కేంద్రాలు కూడా కళకళలాడుతున్నాయి.

వాడపల్లి ఆలయానికి వేలం ఆదాయం రూ.10.35 లక్షలు

దామరచర్ల, జూలై 26: మండలంలోని వాడపల్లి శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర అమ్మకాలకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు దేవాలయ ధర్మకర్త, చైర్మన్ కొందూటి సిద్ధయ్య తెలిపారు. ఈ వేలంపాటకు 30 మంది హాజరుకాగా 22 మంది డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించడానికి నిన్నెబోయిన రాజు రూ.5.60 లక్షలకు దక్కించుకోగా, లడ్డు పులిహోర అమ్ముకోవడానికి కాచిరాజు నాగేశ్వర్‌రావు రూ.4.75 లక్షలకు దక్కించుకున్నారు. దీంతో మొత్తం వేలం ఆదాయం రూ.10.35లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మృత్యుంజయశాస్త్రి, వరలక్ష్మి, లలిత, తిరుమల్‌రెడ్డి, బ్రహ్మం, సర్వయ్య, సాంబశివరావు, తరుణ్, భక్తులు పాల్గొన్నారు.

బీసీలకు 46 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

దేవరకొండ, జూలై 26: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీహార్ తరహాలో 46 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చట్ట రూపంలో అమలుచేసి బీసీలకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి భాస్కరచారి, అంకం చంద్రమౌళి, నారయ్య, సత్యం, బ్రహ్మచారి, ఇరగదిండ్ల కృష్ణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నల్లగొండటౌన్, జూలై 26: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మినీజాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు మూడు ప్రముఖ కంపెనీలు హాజరు కాగా మొత్తంగా 65మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 22 మందిని ప్రాథమిక ఎంపిక చేయగా ఇద్దరు పేటీఎం సంస్థలో ఉద్యోగం సాధించారు. ఉద్యోగం పొందిన వారికి ఉపాధి కల్పన కార్యాలయ జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సామ మాధవరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతీ నెలా క్రమం తప్పకుండా రెండు జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మునుగోడురూరల్, జూలై 26: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం అన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు గోస్కొండ లింగయ్య, గోస్కొండ మల్లేశం, కృష్ణయ్య, మాధవన్, సత్యమ్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

'లంబాడీలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి'

దేవరకొండ, జూలై 26: లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లంబాడీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు బాబురాంనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం లంబాడీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లినట్లు ఆయన తెలిపారు. మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఏఐసీసీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీకి బయలుదేరి వెళ్లినవారిలో లంబాడీ సంఘాల జేఏసీ నాయకులు నాగేశ్వర్‌రావు, లక్‌పతినాయక్, రమేష్, గణేష్, మకట్‌లాల్, సుభాష్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

మునుగోడు, జూలై 26: సమాజంలో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని చండూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) వెంకటయ్య అన్నారు. మునుగోడులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'మాదకద్రవ్యాల నిర్మూలన' అనే అంశంపై విద్యార్థులు, యువతకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు ఎంతో కష్టపడి చదివిస్తుంటే యువత మాత్రం మత్తుకు బానిసగా మారి వారి జీవితాలను నాశనం చేసకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మత్తులో వ్యసనాలకు, జల్సాలకు అలవాటు పడటం, డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ అంజయ్య, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం


నల్లగొండలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

దేవరకొండ, కొండమల్లేపల్లి, దామరచర్ల, జూలై 26: ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించిందని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. జిల్లాలోని పలు మండలాల్లో విద్యారంగానికి సముచిత కేటాయింపులు జరగలేదని ఆరోపిస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి 7.3 శాతమే బడ్జెట్ కేటాయించడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు శూన్యమని పేర్కొన్నారు. పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల గురించి ఊసే లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

● దేవరకొండలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, గణేష్, వంశీ, సతీష్, హనుమంతు, శివ తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, చరణ్, ఇద్దిరాములు, రాకేష్, శివయ్య అరవింద్, మహేష్, మౌనిక, స్వాతి, మంజుల, చందన తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్, కార్యక్రమంలో తరుణ్, చంటి, శ్రీకాంత్, మనోజ్, విజయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని గల మునిసిపల్ పార్కులో మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం గోరింటాకు పండుగ నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం...

నల్లగొండ: పట్టణంలోని 35వ వార్డులో ఇళ్లు లేని పేదలు కిరాయి ఇళ్లల్లో ఉంటున్నారని, వారి కుటుంబంలో ఎవరైనా చనిపోతే కర్మకాండ చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ఆ వార్డు కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మి అన్నారు. కర్మకాండలు నిర్వహించుకునేందుకు భవన వసతి కల్పించాలని కోరారు.

వేములపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శిక్ష సంపత్ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందని హెచ్ఎం రమేష్ అన్నారు. విద్యార్థులకు నైపుణ్య విద్యపై డిజిటల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నల్లగొండ: నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్, ఉదయసముద్రం పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయాలు, బాలాజీ దేవాలయాల అప్రోచ్ రోడ్డు నిధులను దారి మళ్లించవద్దని మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

డిండి: డిండి తహసీల్దార్‌గా అంబటి అంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఆయన జనగాం జిల్లా జాఫర్‌ఘడ్ నుంచి బదిలీపై డిండికి వచ్చారు.

మిర్యాలగూడ టౌన్: లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఇంపాక్ట్ క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ మామిడి సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని పలు కాలనీల్లో మొక్కలు నాటారు.

మిర్యాలగూడ: పట్టాభూమిలో తనను సాగు చేయకుండా అడ్డుకుంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా రైతు గోవిందమ్మ కోరారు. ఈ మేరకు భర్త వెంకట్‌రెడ్డితో కలిసి ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో స్పందిస్తూ తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

నార్కట్‌పల్లి: గురుభక్తి, క్రమశిక్షణతో పాటు ఎంచుకున్న లక్ష్యాలను సాధనతోనే చేరగలమని వ్యక్తిత్వ వికాస ట్రైనర్ అంజిరెడ్డి అన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, మాంద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు.

చిట్యాలరూరల్: మండలంలోని పిట్టంపల్లికి చెందిన అంగన్వాడీ ఆయా మేడి కిష్టమ్మ తీవ్రజ్వరంతో పాటు గుండెపోటు రావడంతో మృతి చెందింది.

బైకు చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు

దేవరకొండ, జూలై 26: ద్విచక్ర వాహన చోరీ కేసులో నిందితుడికి శుక్రవారం ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరకొండ పట్టణంలోని గ్రంథాలయం వద్ద 2024లో నాగర్‌కర్నూల్ జిల్లా బలరాంనగర్‌కు చెందిన కొండ్రపల్లి స్వామి బైక్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అప్పటి ఎస్ఐగా పనిచేసిన సతీష్, కానిస్టేబుల్ రమేష్ నిందితుడిని పట్టుకొని కోర్టుకు రిమాండ్‌కు పంపించారు. ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ దేవరకొండ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కేవీఎస్ హరీష్‌బాబు శుక్రవారం తీర్పునిచ్చినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్‌డీలర్‌కు తీవ్రగాయాలు

తిప్పర్తి, జూలై 26: రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ గడ్డకప్పు ఎల్లయ్య (50) అనిశెట్టి దుప్పలపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్య తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడిపై కోతుల దాడి

చిట్యాలరూరల్, జూలై 26: ఇంటి ఆవరణలో కూర్చున్న వృద్ధుడిపై కోతులు దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం... వెలిమినేడు గ్రామానికి చెందిన కొండాపురం లింగయ్య తన ఇంటి ఆవరణలో కూర్చుని సేద తీరుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి పైనుంచి వెళ్తున్న కోతులు ఒక్కసారిగా లింగయ్యపై దాడి చేశాయి. ఘటనలో లింగయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కోతుల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

చిట్యాలరూరల్, జూలై 26: గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చిట్యాల మండలం వట్టిమర్తిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వట్టిమర్తి గ్రామానికి చెందిన సిరివంగి పరమేష్ (35) అనే యువకుడు కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంట్లో ఉన్న సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందం టూ కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వెంటనే గుండెపోటు రావడం తో పరమేష్ అక్కడికక్కడే కుప్ప కూలిపోయి మృతి చెందాడు. హుటాహుటిన అతడిని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందిన ట్లు నిర్ధారించారు. మృతుడు పరమేష్‌కు భార్య, తల్లిదండ్రులు ఉన్నారు.

వట్టిమర్తిలో వివాహిత అదృశ్యం

చిట్యాలరూరల్, జూలై 26: చిట్యాల మండలం వట్టిమర్తిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వట్టిమర్తి గ్రామానికి చెందిన జయంతిని మునుగోడు చెందిన దాడి కరుణాకర్‌రెడ్డికి వివాహం చేశారు. కరుణాకర్‌రెడ్డి తన భార్య జయంతిని ఈ నెల 15వ తేదీన వట్టిమర్తి గ్రామంలోని వట్టిమర్తిలో వదిలి వెళ్లాడు. ఈ నెల 19వ తేదీన కిరాణం దుకాణానికి వెళ్లేందుకు బయటకు వెళ్లిన జయంతి నివాసానికి చేరుకోలేదు. బయటకు వెళ్లిన ఆమె ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు భర్త దగ్గరికి వెళ్లిందని భావించారు. శుక్రవారం తల్లిదండ్రులు భర్త కరుణాకర్‌రెడ్డికి ఫోన్ చేయగా ఆయన మునుగోడుకు రాలేదని తెలిపాడు. అనంతరం వట్టిమర్తికి వచ్చిన కరుణాకర్‌రెడ్డి బంధువులు, స్నేహితుల నివాసంలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కరుణాకర్‌రెడ్డి తన భార్య కనిపించడంలేదని చిట్యాల ఎస్ ఐ-2 లింగయ్యకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.